సమావేశంలో మాట్లాడుతున్న నాగజ్యోతి

గ్రామ సభలు అట్టర్ ప్లాఫ్

- పోలీస్ పహారా నడుమ నిర్వహణ
- ప్రజా సమస్యలను పట్టించుకోని సీతక్క : జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ములుగు, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలు అట్టర్ ప్లాఫ్ అయ్యాయని, లబ్ధిదారులను ఎంపిక చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో ఆమె మాట్లాడారు. ప్రజలు నిలదీస్తున్నారని ప్రభుత్వం పోలీస్ పహారా మధ్య గ్రామ సభలను నిర్వహించిందన్నారు. ముందుగా ప్రజా పాలన పేరుతో దరఖాస్తులు, ఆతర్వాత సర్వే, పరిశీలన అని ఇప్పుడు గ్రామ సభలను ఏర్పాటు చేసి మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన వారినే లబ్ధిదారులకు ఎంపిక చేసి వారి పేర్లను గ్రామ సభల్లో చదవడంతో ప్రజలు మనస్తాపానికి గురవుతున్నారని, దీనికి నిదర్శనం బుట్టాయిగూడెంలో నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడమే అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రతిపక్ష హోదాలో బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ సభలో పురుగుల మందు తాగి ప్రాణం మీదుకు తెచ్చుకున్న నాగేశ్వర్‌రావు వద్దకు మంత్రి సీతక్క వెళ్లి పరామర్శించే సోయిలో లేదని విమర్శించారు. ల్యాండ్ కూజర్‌లో తిరగడం కాదని, ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను పట్టించుకోవాలని హితవు పలికారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ మాట్లాడుతూ గ్రామ సభల్లో ప్రజలు ఆందోళన చేస్తే వారిని బీఆర్ఎస్ వారు ఉసిగొల్పుతున్నారని కాంగ్రెస్ నాయకులు అనడం సిగ్గుచేటన్నారు. మల్లంపల్లి మండలానికి శ్రీకారం చుట్టిందని బీఆర్ఎస్ పార్టీ అని, అన్ని తామే తెచ్చామనే మంత్రి సీతక్క మెడికల్ కాలేజీ, డయాలసిస్ సెంటర్, 400 పడకల దవాఖాన ఏర్పాటుతో పాటు నియోజకవర్గంలో, జిల్లాలో చేసిన అభివృద్ధి ఎవరు చేశారో తెలుసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, మాజీ ఎంపీటీసీలు పోరిక విజయ్‌రామ్‌నాయక్, గొర్రె సమ్మయ్య, ఆత్మ మాజీ చైర్మన్ రమణయ్య, నాయకులు ఎట్టి జగదీశ్, సానికొమ్ము రమేశ్‌రెడ్డి, వేములపల్లి భిక్షపతి, ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, గజ్జి నగేశ్, మోరె రాజయ్య, మేర్గు సంతోష్, ఎండీ కాసీం, సురేందర్, మహేందర్, శరత్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు పరామర్శ

బుట్టాయిగూడెం గ్రామ సభలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన కుమ్మరి నాగేశ్వర్‌రావును వరంగల్ ఎంజీఎం దవాఖానలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యులకు మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు. వారివెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ ఉన్నారు.

వచ్చే నెలలో దొడ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

ఏటూరునాగారం, జనవరి 24 : మండలంలోని దొడ్ల జంపన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు వచ్చే నెలలో ప్రారంభించి వర్షాకాలం నాటికి పూర్తి చేస్తామని ఆర్ అండ్‌బీ డీఈఈ రఘువీర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్మించిన బ్రిడ్జి 2022లో వచ్చిన భారీ వరదలకు కొట్టుకపోయిందని, అయితే రాష్ట్ర పరిగణలోకి తీసుకుని డిజైన్ చేయడంలో జాప్యం జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 9.5కోట్లు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ నిపుణులు హైదరాబాద్ నుంచి వచ్చి మేడారం నుంచి దొడ్ల వరకు నీటి ప్రవాహం, వెడల్పు లోతులను అక్కడక్కడ లెక్కించి 2022 వరదలను పరిగణలోకి తీసుకుని బ్రిడ్జి డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర డిజైన్‌లో ఎస్టిమేట్ ఫైనల్ చేసి టెండర్‌కు ఆహ్వానించామని, వచ్చే నెలలో పనులు పూర్తి చేస్తామన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మహదేవపూర్, జనవరి 24 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ సమ్దాని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ఆవశ్యకతతో పాటు మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు రవీందర్‌నాయక్, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవితాదేవి, సునీల్, గుండోజు నగేశ్, చంద్రమౌళి, సతీశ్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట : చల్వాయిలో ఎంపీడీవోను నిలదీస్తున్న మహిళ

వెంకటాపురం (నూ) : అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు

ములుగు రూరల్ : గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న కొగిల మహేశ్

మొగుళ్ళపల్లి : అధికారులతో లబ్ధిదారుల వాగ్వాదం

ఆఖరి రోజూ అదే రచ్చ

- గందరగోళంగా ప్రజాపాలన గ్రామసభలు
- లబ్ధిదారుల ఎంపికపై అధికారులను నిలదీసిన ప్రజలు

ఏటూరునాగారం/గోవిందరావుపేట/ మహదేవపూర్(కాళేశ్వరం)/ మంగపేట/ టేకుమట్ల/ ములుగు రూరల్/ వెంకటాపురం(నూగూరు)/ మొగుళ్లపల్లి/ వెంకటాపూర్/ చిట్యాల/ భూపాలపల్లి రూరల్/ కాటారం/ వాజేడు, జనవరి 24 : ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు రచ్చ రచ్చగా మారాయి. ఆఖరి రోజు శుక్రవారం సైతం అధికారుల ప్రకటించిన జాబితాలపై నిరసనలు వెల్లువెత్తాయి. లిస్టులో తమ పేర్లు రాలేదంటూ పేదలు నిలదీశారు. పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో మహిళలు మండిపడ్డారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో 2,068 మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా ఉన్నారని జాబితాను అధికారులు చదివి విన్పించారు. కాగా, బీఆర్ఎస్ నాయకుడు సప్పిడి రాంనర్సయ్య వేదిక వద్దకు వెళ్లి 2,068 ఇండ్లకు అర్హులుగా జాబితా ప్రకటించారని, కానీ, నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరైనట్లు తెలుస్తున్నదనని ఇందులో గ్రామాలకు ఎన్ని వస్తాయి అంటూ ప్రశ్నిస్తుండగా మాజీ జడ్పీటీసీ నామ చందు, కాంగ్రెస్ నాయకులు వేదిక వద్ద రావడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ జోక్యం చేసుకుని సద్దుమణిగేలా చేశారు. ఏటూరునాగారం, కోయగూడ ఎల్లాపూర్, కొండాయి గ్రామాల్లో గ్రామసభల్లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, మండల ప్రత్యేకాధికారి రాంపతి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, ఏవో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు. గోవిందరావుపేట మండలం చల్వాయిలో జరిగిన గ్రామసభలో లబ్ధిదారులు తమ పేర్లు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మళ్లీ దరఖాస్తు చేసుకోమంటారా అని అధికారులపై మండిపడ్డారు. ఇందిర రైతు భరోసాలో ఉపాధి కూలీలుగా తాము దరఖాస్తు చేసినప్పటికీ తమ పేర్లు ఎందుకు రాలేదని, జాగ ఉండి ఇల్లు లేని తమను మీ సర్వే సిబ్బంది ఫొటో తీసుకొని వెళ్లారు. మా పేర్లు ఎందుకు మిస్ అయ్యాయని అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఏపీఎం ప్రసూన, పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ పాల్గొన్నారు. మహదేవపూర్ మండలకేంద్రంతో పాటు అన్నారం, బెగ్లూర్, పల్గుల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా గందరగోళం నెలకొంది. ఆందోళన చేస్తున్న ప్రజలకు పోలీసులు నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. పేర్లు రాని వారు మరోమారు దరఖాస్తులను అందజేయాలని మండల ప్రత్యే అధికారి, డీఎల్‌పీవో వీరభద్రయ్య సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో సుప్రజ్యోతి, ఏఈవో ధర్మేందర్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు. మంగపేట మండల బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చెరుపల్లి, వాడగూడెం గ్రామాల్లో కూలీ పనులు చేసుకొని బతికే తాము ప్రభుత్వ పథకాలకు అర్హులం కామా? అని ప్రశ్నించారు. బోరునర్సాపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీస్తూ వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రు, ఏవో చేరాలు, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు. టేకుమట్ల మండలం రాఘవారెడ్డి, ఆరెపల్లి, వెల్లంపల్లి, ఎంపేడు, సుబ్బక్కపల్లి, సోమనపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఏ పద్ధతిలో ఎంపికలు చేస్తున్నారో చెప్పాలని, నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలిమెల మండలం పంకెన గ్రామంలో నిర్వహించిన గ్రామ సభను భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు వస్తాయన్నారు. ఎంపీడీవో ప్రకాశ్‌రెడ్డి, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన గ్రామ సభ గరం గరంగా సాగింది. పథకాల ఎంపికలో తమ పేర్లు చదవలేదంటూ మండిపడ్డారు. గ్రామ సభకు హాజరైన అధికారులను నిలదీశారు. పోలీసులు, ఇతర అధికారులు వారిని సముదాయించి మళ్లీ ధరఖాస్తులను సమర్పించాలని సూచించి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అలాగే బండారుపల్లి, భూపాల్‌నగర్, దేవనగర్, జగ్గన్నపేట, ముద్దునూరు తండా, శివతండా, శ్రీనగర్ గ్రామాల్లో సైతం గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. గ్రామసభల్లో అధికారులు సైతం అధికార పార్టీ నాయకులకు వంత పడటం సోచనీయమని బీఆర్ఎస్ ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొగిల మహేశ్ తెలిపారు. ప్రజల తరుపున ప్రశ్నిస్తుంటే ప్రతిపక్ష నాయకులను అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ నాయకులు గ్రామ సభల నుంచి వెళ్లిపొమ్మనడం ఎంత వరకు సమంజసమని అన్నారు. అర్హులకు న్యాయం జరిగేవరకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలం వెంకటాపురం, వీరభద్రవరం గ్రామ సభల్లో కొందరికి భవనాలు ఉన్నవారికి, గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చిన లబ్ధిదారులే మళ్లీ వచ్చాయని, నిజమైన వారికి ఇల్లు రాలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐ బండారు కుమార్, ఎస్సై తిరుపతిరావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, జీపీ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు. మొగుళ్లపల్లి మండలం వేములపల్లిలో జరిగిన గ్రామసభలో సర్వే సక్రమంగా చేయకుండా అధికారులు తమ ఇష్టానుసారం లబ్ధిదారుల జాబితా రూపొందించారని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. వెంకటాపూర్ మండలకేంద్రంలో పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారుల పేర్లు వెల్లడిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. సర్వే అధికారులు ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు వసూలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారని ఆరోపించారు. గ్రామ పరిధిలో 45 గొత్తికోయ కుటుంబాలు ఉంటే అందరిని ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. వారిని పథకాల నుంచి తొలగించాలని తీర్మాణం చేస్తూ అధికారులకు తీర్మాణ పత్రాన్ని అందించారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఎస్సై సతీశ్ పాల్గొన్నారు. చిట్యాల మండలం బావుసింగ్‌పల్లి, దూద్‌పల్లి, వరికోల్‌పల్లి గ్రామాల్లో బాధితులు ఆందోళన చేశారు. తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ రాజు పాల్గొన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు సుభాష్ కాలనీ, భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి, నేరేడుపల్లి, బాసింగ్‌పల్లి, గుర్రంపేట, శ్యాంనగర్ గ్రామాలలో శుక్రవారం చివరి రోజు వార్డు, గ్రామ సభలు నిర్వహించారు. మోరంచపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ప్రభుత్వం జనవరి 26న అందజేయనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారుల లిస్టులో అనర్హుల పేర్లు ఉన్నాయని, వాటిని వెంటనే తొగించాలని, అర్హులైన పేద ప్రజలకు భరోసా అందించాలని అధికారులను ప్రజలు నిలదీశారు. భూపాలపల్లి వ్యవసాయ అధికారి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు. కాటారం మండలంలోని ఇబ్రహీంపల్లి, నస్తూర్‌పల్లి, గుమ్మళ్లపల్లి, జాదురావుపేట, గుండ్రాత్‌పల్లి, చింతకాని గ్రామ పంచాయతీల పరిధిలో ఆందోళనల మధ్య శుక్రవారం గ్రామసభలు ముగిసాయి. సంక్షేమ పథకాలకు సంబంధించి జాబితాల ప్రకటనలతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, లబ్ధిదారుల జాబితా తయారీలో అవకతవకలు చోటు చేసుకున్నాయని గ్రామ సభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. చింతకాని జీపీలో జరిగిన గ్రామసభలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏవో పూర్ణిమ, ఏపీవో వెంకన్న, ఆర్ఐ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. వాజేడు మండలం మొరుమురు జీపీ పరిధి ప్రగళ్లపల్లి క్రీడాప్రాంగణం వద్ద నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో భద్రాచలం ఎమ్మెలల్యే వెంకట్రావు పాల్గొన్నారు.అర్హత ఉన్నా తమకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని లబ్ధిదారులు గ్రామసభకు వచ్చిన అధికారులను నీలదీశారు. కార్యక్రమంలో తహసీల్ధార్ శ్రీరాముల శ్రీనివాస్, సీఐ బండారు కుమార్, ఎస్సై రాజ్‌కుమార్, గిర్దావర్ కుమారస్వామి, ట్రాన్స్‌కో ఏఈ అర్షద్‌అహ్మద్, ఏంపీవో శ్రీకాంత్‌నాయుడు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

మహదేవపూర్: ఇందిరమ్మ ఇండ్లను అనర్హులకే ఇచ్చారని అధికారులను నిలదీస్తున్న మహిళ

వాజేడు : అధికారుల ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

మల్లంపల్లి మండలానికి జగదీశ్ పేరు

- ప్రకటించిన మంత్రి సీతక్క
- తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు సురేఖ, సీతక్క, ఎంపీ బలరాంనాయక్

ములుగురూరల్ , జనవరి 24 : దివంగత నేత కుసుమ జగదీశ్వర్ మల్లంపల్లి మండల ఏర్పాటుకు కృషి చేశారని, మండలాన్ని జగదీశ్(జేడీ) మల్లంపల్లిగా మార్చనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ములుగు జిల్లాలో నూతన మండలంగా రూపాంతరం చెందిన మల్లంపల్లిలో మండల ఏర్పాటు సంబురాలు శుక్రవారం అంబరాన్నంటాయి. మంత్రులు ధనసరి అనసూయా సీతక్క, కొండా సురేఖ, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ టీఎస్ దివాకర హాజరయ్యారు. ముందుగా నాబార్డు నిధులతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోదాంను మంత్రులు ప్రారంభించారు. అదే ఆవరణలో ఉన్న మరో భవనంలో మల్లంపల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని ప్రారంభించి ములుగు తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతను అప్పగించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా రాగా, మంత్రులు, ఎంపీకి మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో సీతక్క మాట్లాడారు. దివంగత నేత కుసుమ జగదీశ్వర్ మల్లంపల్లి మండల ఏర్పాటుకు కృషి చేశారని, మండలాన్ని జగదీశ్(జేడీ) మల్లంపల్లిగా మార్చనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్ సీఎం వద్ద ఉందని, వారం రోజుల్లో పూర్తవుతుందన్నారు. జగదీశ్ పేరుతో ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక జీవోను తెస్తామని తెలిపారు. మండలంలో మరిన్ని మండల కార్యాలయాలను ఏర్పాటు చేసి సొంత భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా సమస్యగా ఉన్న ఉమర్‌ఖాన్ భూముల సాగుదారులకు పట్టాలు ఇస్తామన్నారు. గ్రామంలో మహిళా భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామ సభలో అధికారులు మళ్లీ దరఖాస్తు ఇవ్వాలని చెప్పినప్పటికీ కుమ్మరి నాగేశ్వర్‌రావు పురుగుల మందు తాగాడని, అతని భార్యకు తాను టీడీపీలో ఉన్న సమయంలో అంగన్‌వాడీ పోస్టు ఇప్పించానన్నారు. అంతేకాకుండా అతనికి పట్టా భూమి, పోడు భూమి ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి చేసేందుకు తాను సీతక్క కలిసి సమ్మక్క-సారలమ్మలా పని చేస్తామన్నారు. గ్రామంలోని రాములోరి ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు ఇస్తానన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.50 లక్షలు తన నిధుల నుంచి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ బొక్కా సత్తిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీసీసీ కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, కూచన రవళి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, శ్యాంరావు, గుండెబోయిన కుమార్, చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజును మంత్రులు శాలువాతో స్కరించారు.

మల్లంపల్లి మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విజయ్‌భాస్కర్‌ను నియమించి కూర్చోబెడుతున్న మంత్రులు సీతక్క, కొండా సురేఖ

గ్రామ సభల్లో ప్రశ్నిస్తే అరెస్టు సరికాదు

రేగొండ, జనవరి 24 : లబ్ధిదారుల లిస్టులో తమ పేర్లు రాలేదని గ్రామసభల్లో అడిగిన వారిని అరెస్టు చేయడమే ప్రజాపాలనా అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడారు. పెద్దంపల్లిలో గురువారం నిర్వహించిన గ్రామసభలో అధికాలు ప్రకటించిన జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, తిరిగి సర్వే చేయాలని అధికారులను కోరడంతో సభను వాయిదా వేశారు. తిరిగి శుక్రవారం గ్రామసభ నిర్వహించగా సభ ప్రారంభానికి ముందే బీఆర్ఎస్ నాయకులు పసుల రత్నాకర్, సకినాల రమేశ్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి గ్రామసభ పూర్తయిన తర్వాత వదిలిపెట్టారన్నారు. ప్రలజను మోసం చేస్తే అడిగే వారిపై ఉక్కుపాదం మోపుతూ కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు తిరిగి సర్వే నిర్వహించి అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు సామాల పాపిరెడ్డి, పసుల రత్నాకర్, బండి రమేశ్, తడుక శ్రీకాంత్, గోగుల చంద్రాకర్‌రెడ్డి, రావుల రమేశ్, మల్హల్‌రావు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 24 : నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు ఒక్కటే సాధనమని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించగా ముఖ్య అతిథిగా జడ్జి జయరాంరెడ్డి హాజరై మాట్లాడారు. పేదరికం, బాల్య వివాహాలు అనేవి బాలికల అభివృద్ధికి అతిపెద్ద ఆటంకాలు అని, వాటిని అధిగమించి రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న క్రీడా పోటీలను జడ్జి ప్రారంభించి విద్యార్థినిలతో కలిసి కాసేపు కబడ్డీ ఆడారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కంప అక్షయ, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సమ్మయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లలు మొబైల్ వాడకం తగ్గించాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 24 : పిల్లలు మొబైల్ వాడకం తగ్గించాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో దశాబ్ది కార్యక్రమంలో భాగంగా జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులలో ఏకాగ్రత, పోటీతత్వం, సమన్వయం ఉంటే ఏదైనా సాధించగలరని తెలిపారు. రాబోయే పదో తరగతి వార్షి పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.5 వేలు బహుమతిగా ఇస్తానన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత సిబ్బంది అనూష, కృష్ణ, సురేశ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

ములుగురూరల్, జనవరి 24 : నేటి జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా డీఈవో పాణిని ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో ఓటరు దినోత్సవ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతీ పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కాగా, జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ములుగు ఎంజేపీటీబీసీ పాఠశాల విద్యార్థిని ఎం సిరి ప్రథమ స్థానం, రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన జీ రక్షిత ద్వితీయ స్థానం, గోవిందరావుపేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన మహేశ్వరి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులకు నేడు కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాలను అందించనున్నట్లు ఆయన తెలిపారు.

దీక్షలో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే కూనంనేని

ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

గణపురం, జనవరి 24 : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు(కేటీపీపీ) వద్ద తెలంగాణ విద్యుత్ అర్టిజన్ కార్మికుల జేఏసీ చైర్మన్ అల్లం ఓదెలు, కన్వీనర్ బీరెల్లీ రాజు నేతృత్వంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. శుక్రవారం ఆయన దీక్ష చేస్తున్న వారిని కలిసి మద్దతు తెలిపారు. సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేల మంది అర్టిజన్ కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. విద్యుత్ శాఖలో అర్టిజన్ కార్మికులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకోని పనులు చేస్తున్నారని, న్యాయమైన వారి డిమాండ్లను అమలు చేయాలన్నారు. అర్టిజన్ కార్మికులను పూర్తి స్థాయి ఉద్యోగులుగా గుర్తించి ఒకే రూల్స్ ఉండేలా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రెజరర్ మణికుమార్ రత్నం, జెన్‌కోలో సీటీయూ కార్యదర్శి చిలువేరు మల్లయ్య, నాయకులు కుమార్, నాగరాజు, రాజేందర్, సంపత్, శశాంక్ పాల్గొన్నారు.

దేవాదుల ఎత్తిపోతల్లో మరో మోటర్‌తో పంపింగ్

కన్నాయిగూడెం, జనవరి 24 : మండలంలోని దేవ